క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



కోడూరు: వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించడంతో పాటు మితిమీరిగిన వేగంతో వాహనాలను నడపరాదని ఎస్ఐ చాణిక్య సూచించారు. స్థానిక ప్రధాన సెంటర్‌లో వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్‌పై ఆదివారం అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణాలు చేయాలని, ట్రిపుల్ రైడింగ్ చేస్తే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడిపే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష విధిస్తామని చెప్పారు. అనంతరం వాహనాలపై ఉన్న పెండింగ్ ఈ చలానాలను పరిశీలించారు. ట్రైనీ ఎస్ఐ సీహెచ్.దివ్య ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

పైడమ్మ అమ్మవారికి నైవేద్యాలు సమర్పణ



పెడన: శ్రావణ మాసం ప్రారంభం సందర్భంగా పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీపైడమ్మ అమ్మవారికి ఆదివారం కాపులవీధికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో చలినైవేద్యాలను సమర్పించారు. కాపుల వీధి నుంచి పైడమ్మ ఆలయానికి మేళతాళాలతో, వాయిద్యా మేళాలతో ఊరేగింపుగా వెళ్లి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి చలినైవేద్యాలను సమర్పించారు.

నాగేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామ్ పూజలు



కృత్తివెన్ను: శ్రీదుర్గా పార్వతీ సమేత నాగేశ్వర స్వామి వారి దేవస్థానంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్ ఆదివారం ప్రత్యేక పూజలు జరిపారు. జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన తరువాత ఆయన తొలిసారి కృత్తివెన్ను మండలానికి వచ్చారు. అనంతరం కార్యకర్తలతో సమావేశమయ్యారు. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ప్రజలకు అండగా ఉండాలని బీజేపీ కార్యకర్తలకు ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల రామాంజనేయులు, మండల కన్వీనర్ ఏసురాజు, నియోజకవర్గ కో కన్వీనర్ గంగరాజు, నాయకులు దాసరి వెంకటశ్రీనివాస్, సుబ్బారావు, నాగబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఆటల పోటీలు



అవనిగడ్డ: కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల పరిధిలోని విజ్ఞాన విహార స్కూల్స్ ఆటల పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ రెండు జిల్లాల నుంచి 13 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పలు ఆటల్లో పోటీ పడ్డారు. కబడ్డీ, ఖోఖో, చదరంగం, యోగ, షటిల్, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను అండర్ 14, 17 విభాగాల్లో నిర్వహించారు. స్థానిక శాసనసభ్యుడు మండలి బుద్ధ ప్రసాద్ ఈ పోటీలకు విచ్చేసి కొద్దిసేపు క్రీడా పోటీలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి సుధాకర్, స్థానిక విజ్ఞాన విహార స్కూల్ ప్రిన్సిపాల్ నాగ సూర్య తేజ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంగానమ్మ అమ్మవారికి సారె సమర్పణ



పెదప్రోలు(మోపిదేవి): వరుణదేవుడు సకాలంలో కరుణించి, పాడి పంటలు బాగా పండాలని కోరుతూ గంగానమ్మ అమ్మవారికి ఆదివారం శ్రావణ మాసం సారె సమర్పించారు. మండల పరిధిలోని పెదప్రోలు గ్రామంలో ప్రధాన సెంటర్‌లోని అమ్మవారి ఆలయం వద్దకు సాయంత్రం పెద్ద సంఖ్యలో మహిళలు మేళతాళాలు, మంగళవాయిద్యాలతో సామూహికంగా తరలి వచ్చి గంగానమ్మ అమ్మవారికి సారె సమర్పించారు. గ్రామస్తులు భారీగా తరలిరావడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ముందస్తుగా పోలీసులు ఆర్టీసీ బస్సులు, లారీలు, పెద్ద వాహనాలను గ్రామం వెలుపల 216 జాతీయ రహదారిపైకి మళ్లించారు.

అల్లుకున్న నిర్లక్ష్యం..!



కోడూరు తూర్పు వైపు లక్ష్మీటాకీస్ వద్ద..



ఉల్లిపాలెం నాగపుట్ట సమీపంలో..



ఉల్లిపాలెం మధ్యవాడకట్టు వద్ద..



ఉల్లిపాలెం జెడ్పీ పాఠశాల వెనుక భాగంలో అల్లుకున్న పిచ్చితీగలు

- విద్యుత్ తీగలు, స్తంభాలకు అల్లుకున్న ముళ్లతీగలు
- పట్టించుకోని విద్యుత్ శాఖాధికారులు

కోడూరు: విద్యుత్ స్తంభాలు, తీగల వద్ద జంగిల్ క్లియరెన్స్ పనులు చేయలంటూ ప్రతి వారం విద్యుత్ కోత విధించే అధికారుల పనితీరుకు ఈ చిత్రాలు నిదర్శంగా నిలుస్తున్నాయి. విద్యుత్ స్తంభాలు, తీగలకు ముళ్లతీగలు అల్లుకుపోయి ప్రమాదకరంగా మారినా కూడా ఆ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై ప్రజలు మండిపడుతున్నారు. మండలంలోని అనేక ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలతో పాటు తీగలపై ముళ్లతీగలతో పాటు పిచ్చిమొక్కలు అల్లుకుపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్లు, ఫ్యూజ్ బాక్స్‌ల చుట్టూ కూడా మొక్కలు పెరిగి ప్రమాదకరంగా మారాయి.

ఉల్లిపాలెం, కోడూరు పంచాయతీల్లో 33 కేవీ విద్యుత్ లైన్‌పైనే ముళ్లతీగలు అల్లుకున్నా కూడా అధికారులు వాటిని తొలగించే ప్రయత్నం చేయలేదు. మొక్కలు, ముళ్లతీగల కారణంగా ఆ ప్రాంతంలో నిప్పురవ్వలు వచ్చి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవుతోందని, దీంతో నివాస గృహాల్లోని విద్యుత్ గృహోపకరణాలు దెబ్బతింటున్నాయని ప్రజలు వాపోతున్నారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి స్తంభాలు, విద్యుత్ వైర్లపై అల్లుకున్న ముళ తీగలను వెంటనే తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలి



సదస్సులో మాట్లాడుతున్న యూనియన్ కార్యదర్శి కిషోర్

బంటుమిల్లి: రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల పేరుతో వినియోగదారులపై భారాలు వేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు మూకుమ్మడిగా వ్యతిరేకించాలని సీఐటీయూ అనుబంధ కృష్ణా, గుంటూరు జిల్లాల ఎల్ఐసీ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.కిషోర్ పిలుపునిచ్చారు. స్థానిక గుండాబత్తుల ఆంజనేయులు స్మారక భవనంలో ఆదాని స్మార్ట్ మీటర్లు మాకొద్దు – ట్రూ అప్ చార్జీలు రద్దు అనే అంశంపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల కారణంగా వినియోగదారులపై పడే అదనపు భారాలను వివరించారు. వినియోగదారులు ముందుగా డబ్బులు డిపాజిట్ చేయాలని ఆ డబ్బులు ఎప్పుడు అయిపోతే అప్పుడు విద్యుత్ సిబ్బందితో పనిలేకుండా విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సామూహికంగా ఈ విధానాన్ని వ్యతిరేకించకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని ఆయన హెచ్చరించారు. సదస్సులో సీపీఎం, పలు కార్మిక సంఘాల నాయకులు, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు ఘన నివాళి

పెడన: క్షిపణి పితామహులు, భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక విశ్వభారతి హైస్కూలులో జరిగిన కార్యక్రమంలో సేవా సంస్థ కృష్ణా జిల్లా సమన్వయ కమిటీ అధ్యక్షుడు పొట్లూరి వీర శేషగిరిరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. శాస్త్రవేత్తగా దేశానికి ఆయన అందించిన సేవలు నిరుపమానమని కొనియాడారు. కలాం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సేవా సంస్థ పెడన శాఖ అధ్యక్షుడు పేరిశెట్టి నాగరవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సేవా సంస్థ పెడన శాఖ చైర్మన్ ఏవీజీఎస్ఆర్ ప్రసాద్(గౌరి మాస్టర్), వైస్ చైర్మన్ వుటూకూరి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కాగిత శంకర సాంబశివరావు, కోశాధికారి కొట్టు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లిలో..

చల్లపల్లి: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని స్థానిక విజయ అకాడమీలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వైద్యులు డీఆర్కే ప్రసాద్, టి.పద్మావతి, గోపాలం శివన్నారాయణ, ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావులు కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా ప్రసిద్ధి చెందిన అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్క భారతీయునికి ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు షేక్ సిలార్, అబ్దుల్ జబ్బార్, రావి రవి, మహమ్మద్ కరీముల్లా, పైడిపాముల కాశ్మీర్, షేక్ మోయుద్దీన్, గువ్వాబత్తిన నాగేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పెడనలో నివాళులర్పిస్తున్న సేవా సంస్థ ప్రతినిధులు

గూడూరులో నివాళి

గూడూరు: భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని ఆదివారం గూడూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక రజకపేటలో బీఎస్ఎఫ్ మాజీ జవాన్ ఎస్.వీరాంజనేయులు ఆధ్వర్యంలో కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తగా దేశ అణుసాంకేతిక రంగాల్లో కలాం అందించిన సేవలను స్మరించుకున్నారు.



చల్లపల్లిలో నివాళులర్పిస్తున్న వైద్యులు ప్రసాద్, పద్మావతి, గోపాలం శివన్నారాయణ తదితరులు



గూడూరులో శ్రద్ధాంజలి ఘటిస్తున్న స్థానికులు

పశువుల కట్టడికి త్వరలో స్పెషల్ డ్రైవ్

డీఎస్పీ రాజా

కోనేరుసెంటర్: రోడ్లపై పశువుల సంచారాన్ని అరికట్టేందుకు పోలీస్, మున్సిపల్ కార్పొరేషన్, పశు సంవర్ధక శాఖల ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ చేపడతామని బందరు డీఎస్పీ సీహెచ్ రాజా స్పష్టం చేశారు. బందరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో నగరంలోని పశువుల యజమానులతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నగరంలో రోడ్లపై పశువుల సంచారం రోజురోజుకు పెరుగుతుందన్నారు. అందుకు కారణం యజమానులేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరి పశువులను వారు తమ దొడ్లలో కట్టుకుంటే ప్రజలకు ఎలాంటి సమస్య తలెత్తదన్నారు. పశువుల కారణంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయంతో పాటు ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. కొంత మంది ప్రాణాలు పోతున్నాయని, ఇంత జరుగుతున్నా పశువుల యజమానులకు చీమకుట్టినట్టు కూడా ఉండటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పశువుల యజమానులు ఇదే పద్ధతిని అవలంభిస్తే ఖచ్చితంగా పోలీసులు చర్యలు ఉంటాయని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. ప్రభుత్వ చొరవతో బందరు పోర్టు, ఇతర అభివృద్ధి పనులతో బందరు పట్టణంలో సుందరీకరణ కార్యక్రమం జరగబోతుందని అలాంటి సమయంలో రోడ్లపై పశు సంచారం వలన మన ప్రతిష్ఠ మసకబారుతుందని చెప్పారు.

అందుకు యజమానులు కారణం కాకూడదని హితవు పలికారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ పశువుల యజమానులకు ఆయన నోటీసులు జారీ చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ సున్నరాజు, ఎస్ఐలు బాలాజీ, వెంకటేశ్వరరావు, రామశాస్త్రులు, సిబ్బంది పాల్గొన్నారు.



పశువుల యజమానులకు నోటీసులు అందజేస్తున్న డీఎస్పీ రాజా, అధికారులు

నరేంద్రస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు రూ.30 లక్షలు

నంగేగడ్డ(నాగాయలంక): గ్రామంలోని చారిత్రక ప్రసిద్ధి పొందిన శ్రీబాలా త్రిపుర సుందరిదేవి సమేత శ్రీనరేంద్రస్వామి దేవస్థానం జీర్ణోద్ధరణకు రాష్ట దేవదాయశాఖ సర్వ శ్రేయోనిధి(సీజీఎఫ్) నుంచి రూ.30 లక్షలు మంజూరు చేశారు. ఈమేరకు ఆ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సంబంధిత నిధులు మంజూరు లేఖను పంపించినట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పురాతనమైన ఈ దేవాలయాన్ని రూ.45 లక్షల అంచనాతో తలపెట్టిన జీర్ణోద్ధరణ పనులకు కామన్ గుడ్ ఫండ్ నుంచి రూ.30 లక్షలు కేటాయించగా దేవస్థానం ధర్మకర్తల నుంచి మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్ కింద రూ.15 లక్షలు చెల్లించారు. రాజరాజ నరేంద్రుని కాలం నాటి ఈ దేవాలయంలో 75 ఏళ్ల క్రితం నిర్మించిన ముఖ మండపాలు శిథిలావస్థకు చేరాయి. నిధులు మంజూరు చేయించిన సీఎం చంద్రబాబు, దేవదాయశాఖ మంత్రికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఎమ్మెల్యేకు ఆలయ ధర్మకర్త మల్లాప్రగడ హరే రామకృష్ణ ప్రసాద్, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



నంగేగడ్డలోని నరేంద్ర స్వామి ఆలయం

ధూపదీప నైవేద్య పథకానికి శ్రీరామమందిరం ఎంపిక

కోడూరు: మండలంలోని జయపురం శ్రీరామమందిరం ధూపదీప నైవేద్య పథకానికి ఎంపికైనట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదివారం తెలిపారు. తక్కువ ఆదాయం కలిగిన ఆలయాల్లో అర్చకులకు ఆర్థిక స్వావలంబన కల్పించే ప్రధాన ఉద్దేశంతో ప్రభుత్వం ధూపదీప నైవేద్య పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. జయపురం శ్రీరామ మందిరానికి పథకం కింద ప్రతి నెల రూ.10 వేలు ఆర్థిక సహాయంగా మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఆలయాల అభివృద్ధి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు.

స్వామివారి నిత్యాన్నదానానికి విరాళాలు



విరాళం అందజేస్తున్న మధు, అపర్ణ దంపతులు



విరాళం అందజేస్తున్న వెంకట సాయికృష్ణ దంపతులు

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానానికి నెల్లూరుకు చెందిన జె.మధు, అపర్ణ దంపతులు రూ. 50 వేలు, గుంటూరు వాస్తవ్యులు లింగమల్లు వెంకట సాయికృష్ణ రూ. 51,116 విరాళాలను ఆదివారం విడివిడిగా సమర్పించారు. ఆదివారం ఉదయం ఆలయానికి చేరుకున్న వారు తొలుత స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించుకున్నారు. అనంతరం ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు విరాళాలను అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యశిబిరాలకు విశేష స్పందన



కోనేరుసెంటర్: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బందరు మండలం చిట్టిపాలెం గ్రామంలో గ్రామస్తులకు ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 140 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 15 మందికి శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు గుర్తించారు. దృష్టిలోపం ఉన్న వారికి సమితి తరఫున కళ్లజోళ్లను ఉచితంగా అందజేశారు. ప్రముఖ కంటి వైద్యుడు, మచిలీపట్నం సర్వజన ఆస్పత్రి డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ భానుమూర్తి వైద్య శిబిరంలో పాల్గొని వైద్య సేవలను అందించారు. వైద్య శిబిరాన్ని గ్రామ మాజీ సర్పంచ్ రత్తయ్య, సమితి కన్వీనర్ పోతుకూరి ఆంజనేయులు, సేవాదళ్ సభ్యులు పర్యవేక్షించారు.

31 మందికి వైద్య పరీక్షలు

చల్లపల్లి: విజయవాడకు చెందిన అను మై బేబీ, లయన్స్ క్లబ్ ఆఫ్ చల్లపల్లి వీర్కే నగర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్యశిబిరంలో 31 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక లయన్స్ క్లబ్ ఆవరణలో నిర్వహించిన శిబిరంలో డాక్టర్లు గౌతమి, రేవతిలు వైద్య పరీక్షలు చేశారు. 15 మంది పిల్లలకు, 16 మహిళలకు పరీక్షలు నిర్వహించామని తెలిపారు. లయన్స్ క్లబ్ సభ్యులు నర్రా సాయిబాబు, మోపిదేవి వెంకటేశ్వరరావు, జలంధర్ శిబిరాన్ని పర్యవేక్షించారు.

అంతర్గత రోడ్లపై పిచ్చిమొక్కల తొలగింపు

నాగాయలంక: పరిసరాల పరిశుభ్రతలో భాగంగా వర్షాల కారణంగా నాగాయలంకలో రోడ్లకు ఇరువైపులా విపరీతంగా పెరిగిన పిచ్చి మొక్కల నిర్మూలన చర్యలను గ్రామ పంచాయతీ అధికారులు చేపట్టారు. పిచ్చి మొక్కల్లో పాములు, పురుగులు సంచారం పెరిగిందని గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు అందడంతో ఆధునిక బుష్ కట్టర్లతో మొక్కలను సిబ్బంది తొలగిస్తున్నారని గ్రామ కార్యదర్శి జరగు పవన్‌కుమార్ ఆదివారం చెప్పారు. పంచాయతీలోని అన్ని అంతర్గత రహదారుల్లో పిచ్చి మొక్కలను పంచాయతీ సిబ్బందితో తొలగిస్తున్నామన్నారు. సర్పంచ్ కై తేపల్లి అంకాలు, ఉపసర్పంచ్ తలశిల వెంకట నరసింహారావు సూచనలతో ఆయా వార్డుల్లో పంచాయతీ పాలక వర్గ సభ్యుల పర్యవేక్షణలో పంచాయతీ సిబ్బంది జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నారు.



నాగాయలంకలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న సిబ్బంది

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కొడాలి జెడ్పీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు

కొడాలి(ఘంటసాల): మండలంలోని కొడాలి జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 1981–82 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు జెడ్పీ హైస్కూల్‌లో కలసి సందడి చేశారు. ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ వ్యక్తిగతంగా తమ తమ వృత్తి ఉద్యోగ, వ్యాపారాలను తెలుసుకున్నారు.

ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ సంతోషంగా గడిపారు. అనంతరం అప్పటి ప్రధానోపాధ్యాయుడు కీ.శే. జె.సూర్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పించడంతో పాటు నాటి గురువులు సీహెచ్.లక్ష్మీపతి శాస్త్రి, ఎస్.వెంకట గోపాలరావు, ఎస్.అబ్రహాం, యోబు, నాంచారమ్మ, వి.రాజేంద్ర ప్రసాద్, ఎ.బాబూరావు, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు పోతన లక్ష్మీశ్వరరావులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కె.నాంచారయ్య, జి.ధాన్యారాణి, వి.బాలకృష్ణ, కె.శేషు, వి.వకుళ, కె.రమణ, బి.సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కోడూరులో లోపించిన పారిశుద్ధ్యం

కోడూరు: ఓ వైపు వర్షాలు మరో వైపు లోపించిన పారిశుద్ధ్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీల పరిధిలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ స్థానిక అధికారులు మాత్రం వాటిని పూర్తిగా విస్మరిస్తున్నారు. కోడూరు పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో చెత్త సేకరణ సరిగ్గా లేకపోవడంతో ఎక్కడ చెత్త అక్కడే దర్శనమిస్తోంది. ప్రస్తుతం వర్షాలు కూడా కురవడంతో ఈ చెత్త కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతోందని ప్రజలు వాపోతున్నారు. స్థానిక ఇండోర్ స్టేడియం సమీపంలో చెత్త నిల్వలు వారం రోజులుగా పేరుకుపోవడంతో పశువులకు ఆవాసంగా మారింది. పంచాయతీ అధికారులు స్పందించి వెంటనే చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రకృతి సాగుపై విద్యార్థులకు శిక్షణ



మోపిదేవి: స్థానిక జెడ్పీ పాఠశాల ఆవరణలో పలురకాల కూరగాయలు తయారు చేసేందుకు బెడ్స్ సిద్ధం చేస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయంతి తెలిపారు. అందులో భాగంగా నేలను చదును చేయడంతో పాటు మొక్క నాటే విధానాన్ని ప్రాక్టికల్‌గా విద్యార్థులకు నేర్పించారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండలమ్మకు మొక్కుబడుల చెల్లింపు

గుడ్లవల్లేరు: కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెల్లవారు జాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కుబడులను చెల్లించుకునేందుకు బారులు తీరారు. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయంలో కోలాహలం నెలకొంది.